క్లుప్తంగా

పాఠ్యపుస్తకాల పరిశీలన



పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓ వెంకట్రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : మండలానికి 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి మంజూరైన పాఠ్యపుస్తకాలను డోన్ డిప్యూటీ ఈఓ వెంకట్రామిరెడ్డి మంగళవారం పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిల్వ ఉన్న పాఠ్యాపుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఈఓ మాట్లాడుతూ మండలంలో 1 నుంచి 10వ తరగతి వరకు సుమారు 9.500 మంది విద్యార్థులు ఉన్నారని, వీరికి సంబంధించి మొదటి సెమిస్టర్ పుస్తకాలు 28,709 పాఠ్యాపుస్తకాలు సరఫరా అయ్యాయన్నారు. మరికొన్ని పుస్తకాలు రావాల్సి ఉందన్నారు. ఇప్పటికే విద్యార్థులకు యూనిఫాం, నోటు పుస్తకాలు వచ్చాయని, త్వరలోనే వీటిని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణ, సీఆర్‌పీలు సుధాకర్‌రావు, మధు, చంద్రుడు, ప్రసాద్, శివరామయ్య తదితరులు ఉన్నారు.

బ్రహ్మంగారి కాలజ్ఞానం ప్రపంచానికి ఆదర్శం



బ్రహ్మంగారి చిత్రపటానికి పూలమాలవేస్తున్న దృశ్యం

బనగానపల్లె : బ్రహ్మంగారి కాలజ్ఞానం ప్రపంచానికి ఆదర్శమని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మనంద ఆచారి అన్నారు. మండలంలోని పలుకూరు గ్రామంలో మంగళవారం బ్రహ్మంగారి ఆరాధన ఉత్సవాల సందర్భంగా కాలజ్ఞాన విశిష్టతపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మంగారి చిత్రపటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాముఖ్యత సంతరించుకున్న బనగానపల్లె సమీపంలోని రవ్వలకొండను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బాలహనుమంతు, జగన్‌మోహన్‌రెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి



వైద్యునికి సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశా వర్కర్లు

బేతంచెర్ల: న్యాయమైన డిమాండ్ల కోసం ఈనెల 20న ఆశా వర్కర్లు నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య, మండల కార్యదర్శి రహంతుల్లా కోరారు. మంగళవారం మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు అలీమ్, బేతంచెర్ల పట్టణ అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యురాలు ప్రియాంకకు ఆశావర్కర్లతో కలిసి వారు సమ్మె నోటీసులు అందజేశారు.

సారా తయారీకి బెల్లాన్ని విక్రయిస్తే చర్యలు



వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ వర్ధనాదేవి

బనగానపల్లె : సారా తయారీకి బెల్లాన్ని విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని బనగానపల్లె ఎక్సైజ్‌శాఖ సీఐ వర్ధనాదేవి హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో బనగానపల్లెలోని బెల్లం వ్యాపారులు, హోల్‌సెల్ వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ బెల్లాన్ని విక్రయించే వారు తప్పనిసరిగా బిల్లులను ఇవ్వాలని, అధిక బెల్లం తరలించేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ కమలాకర్, కిరాణం మర్చంట్ అసోసియేషన్ సభ్యులు, హోల్ సెల్ వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి



మహబూబ్

బనగానపల్లె రూరల్ : స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో టైపిస్ట్‌గా విధులు నిర్వహించే సయ్యద్ మహబూబ్ సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందినట్లు సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ మంగళవారం తెలిపారు. కర్నూలు రిజనల్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయానికి పదోన్నతిపై బదిలీ చేయడం జరిగింది. బదిలీపై వెళ్లిన మహబూబ్‌ను ఐసీడీఎస్ సిబ్బంది,పట్టణ ప్రజలు అభినందించారు.

మహిమాన్వితుడు..

పాండురంగ విఠలేశ్వరుడు

- 500 సంవత్సరాల చరిత్ర కలిగిన ఆలయం
- భక్తుల పాలిట కొంగు బంగారం
- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు
- 11 రోజులపాటు ఉత్సవాల నిర్వహణ



బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న పాండురంగ విఠలేశ్వరుని ఆలయం (ఇన్‌సెట్)అలంకరణలో శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి

కోవెలకుంట్ల: శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మితమై కోరిన కోర్కెలు తీర్చుతూ కొంగు బంగారమై భక్తులచే పూజలందుకుంటూ శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడు ప్రజల ఆరాధ్య దైవంగా పూజింపబడుతున్నారు. ప్రతి ఏటా వైశాఖ మాసంలో 11రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. బుధవారం నుంచి ఈ నెల 17వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కోట తిరుణాలతో ప్రారంభమయ్యే ఉత్సవాలు వసంతోత్సవం కార్యక్రమంతో ముగియనున్నాయి.

ఆలయ చరిత్ర

శ్రీదేవి భూదేవి సహకిత పాండురంగ విఠలేశ్వర ఆలయానికి ప్రత్యేక చరిత్ర ఉంది. శాలివాహనశకం 1493వ సంవత్సరంలో పెనుగొండ మహారాజు తిరుమల దేవమహారాయలు దేశాటనకై ఈ ప్రాంతానికి వచ్చినట్లు చరిత్ర. ఇక్కడున్న జుర్రేరు, కుందూనది జీవనదులుగా ప్రవహిస్తూ చింతవనాలు, నీటికుంటలతో ప్రకృతి ఆహ్లాదకరంగా ఉండటంతో ఇక్కడ విడిదిచేశారు. ఈ ప్రాంతం గురించి కోవెల అనే భక్తురాలి నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఆ సమయంలో ఒకరోజు రాత్రి పాండురంగ విఠలేశ్వరుడు రాజుకు, కోవెలకు కలలోవచ్చి ఇక్కడ ఒక ప్రాంతం కనుమరుగైందని, గ్రామం నిర్మించి దేవాలయం కట్టించాలని చెప్పినట్లు పూర్వీకుల కథనం. ఇరువురికీ ఒకటేకల వచ్చిందని తెలియడంతో అదే సంవత్సరంలో ఒక పెద్దదేవాలయం నిర్మించి తిరుమలదేవ మహారాయల చేత విగ్రహప్రతిష్ఠ గావించినట్లు శిలాశాసనం ఉంది. కనుమరుగైన గ్రామాన్ని తిరిగి నెలకొల్పడంతో భక్తురాలిపేరుమీద ఈ ప్రాంతానికి కోవెలగా నామకరణం చేశారు. కుంటలో నుంచి గ్రామాన్ని తీసి నిర్మించడం వల్ల కోవెలకుంట... కాలానుగుణంగా అది కోవెలకుంట్లగా మార్పుచెందింది.



ఆలయ ఆవరణలో జీర్ణోద్ధరణ గావించిన పురాతన బావి



స్వామివార్ల కల్యాణానికి సిద్ధమవుతున్న అద్దాల కల్యాణమండపం

నిత్యపూజలందుకుంటున్న పాండురంగ విఠలేశ్వరుడు

500 సంవత్సరాల క్రితం తిరుమలదేవ మహారాయలచేత నిర్మించబడ్డ పాండురంగస్వామి దేవాలయంలో ప్రతిష్ఠించిన పాండురంగవిఠలేశ్వరుడు నాటి నుంచి నిత్యపూజలందుకుంటున్నారు. ఐదు శతాబ్దాల కాలం నాటి పురాతన ఆలయం కావడంతో 2018వ సంవత్సరంలో దాతల సహకారంతో రూ. 1.50 కోట్లతో ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దారు. రూ. 10 లక్షలతో ఆలయ గర్భగుడి జీర్ణోద్ధరణ, రూ. 10 లక్షలతో ఇత్తడి తొడగులు, రూ. 5 లక్షలతో వెండి తొడగులు, రూ. 20 లక్షలతో ఆలయం లోపల, ఆవరణలో ఫ్లోరింగ్, రూ. 4 లక్షలతో ఆర్చీల అభివృద్ధి, రూ. 5 లక్షలతో అద్దాల కల్యాణ మండపం, రూ. 4 లక్షలతో పురాతన బావి, రూ. 5 లక్షలతో మూలవిరాట్ విగ్రహాలు, రూ. 5 లక్షలతో ఆలయ ప్రాంగణంలో సీసీ రోడ్లు, రూ. 10 లక్షలతో గార్డెన్, రూ. లక్షతో పిల్లల పార్కు, రూ. 10 లక్షలతో షాపింగ్‌కాంప్లెక్స్, రూ. 50 లక్షలతో ఇతర అభివృద్ధి పనులతో ఆలయానికి పూర్వ వైభవం వచ్చింది. పురాతన ఆలయం కొత్త శోభను సంతరించుకుంది. ప్రతి సంవత్సరం వైశాఖమాసంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు కనులపండువగా నిర్వహించడం విశేషం. బ్రహ్మోత్సవాలు మతసామరస్యానికి ప్రతీకగా దాదాపు 11రోజులపాటు నిర్వహించనున్నారు.

11 రోజులపాటు బ్రహ్మోత్సవాలు

7వ తేదీ మొదటి రోజున కోట తిరుణాల, 8న ద్వాదశ కుంభహారతి, పేట, కోనేటి తిరుణాల, 9న పాండురంగడి కల్యాణ మహోత్సవం, 10న హనుమద్వాహన సేవ, 11న సింహవాహన సేవ, 12న శేషవాహనం, 13న గరుడవాహనం, 14న గజేంద్రవాహనం, 15వ తేదీన పూర్ణాహుతి, రథోత్సవం, 16న మైలతేరు, 17వ తేదీన వసంతోత్సవం, నాకబలితో ఉత్సవాలు ముగుస్తాయి.

చెత్త సంపద కేంద్రాలతో ఆదాయం పెంచాలి



చెత్త సంపద కేంద్రాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోవెలకుంట్ల: గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాల ద్వారా గ్రామ పంచాయతీల ఆదాయం పెంచాలని కోవెలకుంట్ల, సంజామల ఎంపీడీఓలు వరప్రసాదరావు, సాల్మన్ సూచించారు. కోవెలకుంట్ల గ్రామ పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో మంగళవారం కోవెలకుంట్ల, సంజామల మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులు, క్లాప్, షెడ్‌మిత్రలకు చెత్త సంపద కేంద్రాల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల పరిధిలో సేకరించి తడి, పొడి వ్యర్థాలను వేరు చేసి వర్మీకంపోస్టు తయారు చేసి విక్రయాలు జరిపి గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలన్నారు. ప్రజలు చెత్త, చెదారం, తదితర వ్యర్థాలను డ్రైనేజీల్లో వేయకుండా గ్రామ పంచాయతీ అందజేసిన డస్ట్‌బీన్లలో వేసి పారిశుద్ధ్య కార్మికులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా మండలాల డిప్యూటీ ఎంపీడీఓలు ప్రకాష్‌నాయుడు, రాధిక, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



మోకాళ్ల పై నిల్చొని కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న సీహెచ్‌ఓలు

బనగానపల్లె రూరల్ : ఆయుష్మాన్ భారత్‌లో సీహెచ్‌ఓలు విధులు నిర్వహించే ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ గురుప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో వైద్య ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమ శాఖ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో నిరవధిక సమ్మె భాగంగా 9వ రోజు సీహెచ్‌ఓలు మోకాళ్ల పై నిల్చొని కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. గురుప్రసాద్ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగభద్రత కల్పించాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ సురేష్‌బాబు ఎగ్జిక్యూటివ్ సభ్యులు వినోద్‌కుమార్, సబ్‌ట్రెజరర్ హారిక తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి



జెండా ఎగుర వేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు మే డే ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు ధర్మారం రంగనాయకులు సూచించారు. మంగళవారం పట్టణ సమీపంలోని జాతీయ రహదారి వద్ద ఐఎఫ్‌టీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను ప్రవేశ పెట్టడం దారుణమన్నారు. కగార్ పేరుతో అమాయక ప్రజలను బలి తీసుకుంటున్నారని వెంటనే కగార్‌ను ఆపాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ సంఘం నాయకులు దొరపల్లె రాజు, ఐఎఫ్‌టీయూ నాయకులు బందె నవాజ్‌వలి, లక్ష్మన్న, మునేంద్ర, సునీత, సాలమ్మ, లక్ష్మీదేవి, సుమలత, అంజి, వెంకట్రాముడు, మాధవస్వామి, విజయ్ తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కార్మికులను అప్కాస్‌లో కొనసాగించాలి

డోన్ రూరల్: మున్సిపల్ కార్మికులను అప్కాస్‌లోనే కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య, నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు అబ్బాస్ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ వేతనంతో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయకుండా కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చాలని చూడటం తగదన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వస్తువులు పంపిణీ

డోన్ టౌన్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు సబ్బులు, కొబ్బరి నూనే, చెప్పులు, దుస్తులను కమిషనర్ ప్రసాద్ గౌడ్, చైర్మన్ సప్తశైల రాజేష్ మంగళవారం పంపిణీ చేశారు. రెండేళ్లకు అవసరమయ్యే సామగ్రిని అందజేసినట్లు వారు తెలిపారు.

టీడీపీ రంగు పూయొద్దు

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ కాలనీల్లోని వాటర్ ట్యాంకులకు టీడీపీ రంగు పూశారని కాలనీవాసులు ఎర్రగుంట్ల రాజు, ఆనంద్, రమేష్, నిరంజన్, నాగరాజు, నక్క శ్రీను నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. పార్టీలతో సంబంధం లేకుండా ప్రజలకు సేవలందించాలని వారు వినతి పత్రంలో కోరారు.

రేపటి నుంచి విష్ణుకంటి క్షేత్రంలో ఉత్సవాలు



పేరుసోములలో శ్రీ కంబగిరి లక్ష్మీనరసింహ స్వామి,



విద్యుత్ బల్బుల అలంకరణలోశ్రీ విష్ణుకంటి క్షేత్రం

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలో వెలసిన విష్ణుకంటి క్షేత్రం 15వ వార్షికోత్సవ వేడుకలకు ముస్తాబయ్యింది. గ్రామంలో కంబగిరి లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం, రామ్మోహన్ స్వామి జయంతిని గురువారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కంబగిరి స్వామి ఉపాసకులు శ్రీ రామ్మోహన్ స్వామి తెలిపారు. మొదటి రోజు విష్ణు సహస్రనామ పారాయణం, అంకురార్పణ, ప్రథమ అగ్ని, నిత్యవిధి, వేదపఠనము, బ్రహ్మంగారి చరిత్ర నాటక ప్రదర్శన, రెండవ రోజు 108 కలశాభిషేకం, అన్నకూట ఉత్సవము, గోవర్ధనగిరిధారి అలంకారం, మూడవరోజు శ్రీ ఆదిలక్ష్మి సిద్ధలక్ష్మీ సమేత శ్రీ కంబగిరి లక్ష్మీ నరసింహ స్వామి వారి తిరుకళ్యాణోత్సవం, గరుడవాహనంపై స్వామివారి గ్రామోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు. విష్ణు కంటి క్షేత్రం విద్యుత్ దీపాల వెలుగులో కళకళలాడుతోంది.

ఈరోజు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇండస్ట్రీయల్ సబ్ స్టేషన్ పరిధిలోని ధర్మారం, కన్నపకుంట, చింతలపేట, గోసానిపల్లె, కోట్లవారి పల్లెతో పాటు ఫ్యాక్టరీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు ఇచ్చే త్రీఫేజ్ కరెంటు తెల్లవారు జామున 3 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు సరఫరా ఉంటుందన్నారు.

ఎడ్ల బండలాగుడు పోటీలు

డోన్ రూరల్: మండల పరిధిలోని చింతలపేట గ్రామంలో శ్రీశ్రీశ్రీ జగద్గురు మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన మహోత్సవం సందర్భంగా బుధవారం ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు, కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. గెలుపొందిన వృషభాల యజమానుకు రూ.30 వేలు, రూ.20వేలు, రూ.10 వేలు, రూ.5వేలు, రూ.3వేల చొప్పున నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే 8వ తేదీన గుండు ఎత్తే పందెం, మోటర్ సైకిల్ స్లో రేస్ నిర్వహించి నగదు బహుమతులు అందజేస్తామన్నారు.

9 మందిపై అట్రాసిటి కేసు నమోదు

సంజామల: మండల పరిధిలోని కానాల గ్రామానికి చెందిన 9 మందిపై మంగళవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. కానాల గ్రామానికి చెందిన యాకోబు ఈనెల 4న ఉదయం తన ఆటోలో కూలీలను ఎక్కించుకుని వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన తలారి వెంకటేశ్వర్లు, మరో ఎనిమిది మంది ఆటోను అడ్డుకుని పాత కక్షలను మనస్సులో ఉంచుకుని కులం పేరుతో దూషిస్తూ విచక్షణ రహితంగా కట్టెలతో కొట్టారన్నారు. యాకోబు ఫిర్యాదు మేరకు ప్రాథమిక విచారణ జరిపి బోయ వెంకటేశ్వర్లు, బోయ మురళి, బోయ తలారి వెంకటసుబ్బయ్య, బోయ తలారి కిరణ్, బోయ తలారి శ్రీను, బోయ తలారి రవీంద్ర, బోయ తలారి లక్ష్మీదేవి, బోయ తలారి సుధారాణి, బోయ తలారి వరాలుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో కుంభాభిషేకం





పూజలందుకుంటున్న పంచలోహ అమ్మవారి విగ్రహం, రుద్ర, చండీ హోమాలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్య కుటుంబాలు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో మహాకుంభాభిషేక వజ్రోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు మంగళవారం వేద పండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి గణపతి పూజ, స్వస్తివాచనము, ప్రాత:కాలపూజ, అగ్నిముఖము, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, శ్రీచక్రనవావరణార్చన తదితర పూజ కార్యక్రమాలు జరిగాయి. అలాగే సాయంత్రం ప్రదోషకాల పూజ, జప అనుష్టానములు, లలితా సహస్రనామ పారాయణము, రుద్ర, చండీ, సుబ్రమణ్యస్వామి మన్యుసూక్త, గాయత్రీ హోమాలు నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి సీతారాముల గ్రామోత్సవం సాంస్కృతిక కార్యక్రమాల నడుమ కమనీయంగా సాగింది.

14 అడుగుల పంచలోహ విగ్రహం

వజ్రోత్సవాల్లో భాగంగా వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలోని గర్భగుడిలో 14 అడుగుల పంచలోహ వాసవీమాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా పెనుగొండ వాసవీ మాత ఆలయంలో 102 అడుగుల పంచలోహ విగ్రహం ఉండగా నంద్యాల జిల్లా కోవెలకుంట్లలో రెండవ పంచలోహ విగ్రహం ఏర్పాటు చేసినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు

డోన్ రూరల్: మండల పరిధిలోని ఓబులాపురం గ్రామం వద్ద చోటుచేసుకున్న రోడ్డుప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాలు.. బుచ్చయ్యపల్లి గ్రామం నుంచి హైదరాబాద్‌కు మామిడి కాయలతో వెళ్తున్న వ్యాన్ ఓబులాపురం వద్దకు చేరుకోగానే టైర్ పేలిపోవడంతో బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ గాయపడ్డారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తన కాన్వాయ్‌ని ఆపి, కాన్వాయ్‌లోని ఫస్ట్ ఎయిడ్ కిట్‌తో తన సిబ్బందితో ప్రాథమిక వైద్యం చేయించి 108 వాహనంలో డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

డోన్ రూరల్: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం ప్రకృతి వ్యవసాయ అధికారులు అశోక్, వెంకటరాముడు రైతులకు అవగాహన కల్పించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు క్రిమిసంహారక మందులు వాడటంతో ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పండించే ఆహార పదార్థాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నారు. రసాయన మందులకు బదులు వేపనూనే, కసాయం, ఆవు పాడ, ఆవు మూత్రం తదితర వాటితో తయారు చేసుకుని పంటలకు పిచికారీ చేసుకోవాలన్నారు.

వేలంపాటలో కమిషనర్ కిరికిరి

బహిరంగంగా నిర్వహించాల్సిన వేలంపాటలను నగర పంచాయతీ కమిషనర్ గోప్యంగా నిర్వహించేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. ఎక్కువ మందిని వేలంపాటలో పాల్గొనేలా చర్యలు తీసుకుని పంచాయతీకి ఆదాయం సమకూరేలా చూడాల్సిన నగర పంచాయతీ కమిషనర్.. ఎవరి మెప్పు కోసమో కానీ తూతూమంత్రంగా నిర్వహించి చేతులు దులిపేసుకునేందుకు నానా తంటాలు పడ్డారు. ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగప్రవేశం చేసి వేలంపాటలను బహిరంగ ప్రదేశంలోనే నిర్వహించాలని పట్టుబట్టడంతో ఒకానొక సందర్భంలో వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోయారు. సాయంత్రం మనసు మార్చుకుని అయిష్టంగానే అందరినీ పిలిచి వేలంపాటలు పూర్తి చేశారు. నాటకీయ పరిణామాల మధ్య జరిగిన వేలంపాటల్లో పంచాయతీకి గత ఏడాది కంటే అదనంగా రూ.5,40,000 ఆదాయం సమకూరింది.

- బహిరంగ వేలంపాటను గోప్యంగా నిర్వహించేందుకు విశ్వప్రయత్నం
- అభ్యంతరం తెలిపిన ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- చివరికి దిగొచ్చిన కమిషనర్



కార్యాలయం మధ్యలో వేలం పాటలు నిర్వహిస్తున్న కమిషనర్ హరి ప్రసాద్



వేలం పాటలు బహిరంగంగా నిర్వహించాలని కమిషనర్‌ను కోరుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

బేతంచెర్ల: పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం దిన, వారపు సంత మార్కెట్, బండ్ల మెట్ట, కబేళా వేలం పాటలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే ఎప్పుడూ లేని విధంగా కార్యాలయం మధ్యలో వేలంపాటను నిర్వహించడానికి నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ ఏర్పాట్లు చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ ప్రజలు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మురళీకృష్ణ, పట్టణ కన్వీనర్ పిట్టల జాకీర్, వార్డు కౌన్సిలర్లు కోట్ల మధుసూదన్, ఇబ్రహీమ్, మాజీ వార్డు మెంబర్లు ఖాజా, సలీమ్, నాయకులు అల్తాఫ్, వలిబాషా నగర పంచాయతీ కార్యాలయం చేరుకొని వేలం పాటలు గతంలో మాదిరిగానే నగర పంచాయతీ కార్యాలయం ఆవరణంలో నిర్వహించాలని కోరారు. బహిరంగ వేళాలు ప్రజల మధ్యలో నిర్వహించాలని, కార్యాలయం మధ్యలో రహస్యంగా ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. పాటదారులు కూడా ఎవరూ రారని, ఫలితంగా పంచాయతీకి ఆదాయం తగ్గే అవకాశం ఉందని వివరించారు. కమిషనర్ ఒప్పుకోకపోవడంతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈక్రమంలో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకోవడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. సీఐ వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ రమేష్‌బాబు తమ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. వారి సహకారంతో నగర పంచాయతీ కమిషనర్.. తన కార్యాలయం మధ్యలోనే వేలంపాట ప్రారంభించారు. దిన, వార సంత మార్కెట్‌ను చంద్రశేఖర్‌రెడ్డి జీఎస్టీతో కలుపుకొని రూ.13,75 880 దక్కించుకున్నారు. అనంతరం బండ్ల మెట్ల వేలం పాటలు కొనసాగుతుండగా మధ్యలోనే ఏమైందో ఏమో కానీ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి కమిషనర్ వెళ్లిపోయారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్ల మేరకో, మరే కారణం చేతనో సాయంత్రం మరోసారి బండ్ల మెట్ట వేలం పాటలు నిర్వహించగా సుబ్రహ్మణ్యం రూ.19,88,300 పాట పాడి దక్కించుకున్నారు. కాగా గత ఏడాది కంటే ఈ ఏడాది సంతమార్కెట్, బండ్ల మెట్ల వేలం పాటల ద్వారా రూ.5,40,000 అదనపు ఆదాయం సమకూరింది. కానీ ఇంత కిరికిరి లేకుండా, బహిరంగా వేలంపాటలు నిర్వహించి ఉంటే మరింత ఆదాయం సమకూరేదని ప్రజలు చర్చించుకున్నారు.